


రూమ్‌లోకి నడిచాడు స్టేషన్ మాస్టరు. ఆ రెండు ప్రాణాలని ఆ ప్రభువే కాపాడాలి అని అనుకున్నాడు.

సీటులో కూర్చున్నా కూర్చో బుద్ధి పుట్టలేదు అతనికి. అప్పలకొండ బెజవాడ చేరటం ఆలశ్యమైతే.

అప్పలకొండ చాలా మంచివాడు, స్నేహశీలి. అడగకుండానే ఎవరికైనా సహాయం చేస్తాడు. మరి అతనికి ఈ బాధేమిటి.

అతని మనసులోని ఆలోచనలలో చీకటికి పొరలు మెల మెల్లిగా తొలగిపోయాయి.

"రెడ్ సిగ్నల్ చూపిన 141 అప్ సడన్‌గా స్టేషన్‌లో ఆగింది. అప్పలకొండని, అతని భార్యని 141 అప్‌గార్డుకి అప్పచెప్పి పచ్చ జెండా ఊపాడు స్టేషన్ మాస్టర్.

రెండు నిండు ప్రాణాలని కాపాడాననే సంతృప్తి ముందు 141 అప్ షెడ్యూల్డుగా ఆపినందుకు రాబోయే ఛార్జి షీటుగాని, మరో మారుమూల గ్రామానికి రాబోయే ట్రాన్స్‌ఫర్‌గాని చాలా తేలికగా తోచింది అతనికి.

— ఎల్.ఆర్. స్వామి

# అదో రకం

సహజంగా నాది మౌనంగా వుండే స్వభావం. అతనిదీ అంతే! ఎంతో అవసరమయితేనే గాని, నోరు విప్పి మాట్లాడే స్వభావం కాదు ఇద్దరిదీ!

ఇద్దరమూ ఫిజిక్స్ విద్యార్థులంకనుక సబ్జెక్టు వివరాలు, రికార్డు వర్కు, ఎనాలిసిస్ అడపా దడపా చర్చించుకునే వాళ్ళం. క్రమంగా మా మైత్రి కొంచెం గాఢమైంది.

హోస్టలు బిల్లు, ఇతర ఖర్చులు కలిపి మాకు నెలసరి నాలుగు వందలు అవుతుంది. ఇంటి నుండి నాకు ప్రతి నెల డ్రాఫ్ట్ వస్తుంది. అయితే శేషుకు మాత్రం అడపా దడపా మనియార్డర్లు కూడా వస్తుంటాయి. బహుశా బంధువులెవరయినా సర్దుబాటుకోసం కొంత డబ్బు పంపుతున్నారేమో అనుకున్నాను.

ఒక రోజు హోస్టలు బిల్లు కట్టి వస్తూ "నీకు చాల మంచి బంధువులున్నారు కదూ!" అన్నాను శేషుతో.

"అంటే!" అన్నాడతను సాలోచనగా.

"అప్పుడప్పుడు నీకు మనియార్డర్లు పంపిస్తుంటారుగా!" అన్నాను.

శేషు నావైపు చూసి మందహాసం చేశాడు. కాని ఏమీ చెప్పలేదు. నేను కూడా రెట్టించి అడగలేదు.

గదికి చేరాక మని ఆర్డరు కూపన్లు కొన్ని నా ముందు పడేసాడు శేషు.

"ఏమిటిది?" అన్నాను.

"ఎంత ఎం.ఒ. చేశారో చూడు!" అన్నాడు.

"అర్థ రూపాయి మాత్రమే!" అన్నాను ఆశ్చర్యంగా.

అన్నీ అర్థ రూపాయి కూపనులే! మరీ ఆశ్చర్యమేమంటే, అవన్నీ కూడా శేషు నాన్న పంపినవే!

"ఏమిటిదంతా! నా కర్థం కావడం లేదు" అన్నాను అయోమయంగా.


"మా నాన్నది అదొకరకమయిన మనస్తత్వం. కాని ఎవ్వరికీ హాని కలిగించేది కాదు. ఎప్పుడో ఇరవయి సంవత్సరాలనాడు ఆయన రాసిన ఉత్తరమొకటి అవతల వారికి చేరలేదట! పోస్టులో పోయి వుంటుందని ఆయన నమ్మకం. అప్పటి నుండి ఆయన ఉత్తరాలు రాయడం మానివేశారు!" అన్నాడు శేషు.

"మరి!" అన్నాను సరిగా అర్థం కాక.

"మరేం లేదు. ఎవరికి ఉత్తరం రాయాల్సివచ్చినా అర్థ రూపాయి మనియార్డరు చేస్తారు. ముప్పయి పైసలు ఎం.ఒ. కమిషన్ ఖర్చు అవుతుంది. కూపన్‌లో చిన్న చిన్న అక్షరాలలో కుదించి ఉత్తరం రాస్తారు. మొత్తంమీద ఎనభయి పైసల ఖర్చుతో అవతలవారికి ఎంతటి ముఖ్యమయిన సమాచారమయినా అవలీలగా చేరుతుంది. ఇది ఆయన సిద్ధాంతం. నాకు ప్రతి నెల నాలుగు వందలు డిమాండు డ్రాఫ్ట్ పంపుతారు. మధ్యలో ఏదయినా సమాచారం తెలియపరచవలసి వస్తే అర్థ రూపాయి మనియార్డరు చేస్తారు. ఇది ఇతరులకు విడ్డూరంగా వుండవచ్చు! కాని మేమంతా ఆయన మనస్తత్వానికి అలవాటు పడిపోయాం!" అన్నాడు శేషు.

ఏం మాట్లాడాలో అర్థం కాక మౌనంగా వుండిపోయాను.

—కెప్టెన్ షేక్ మౌలాలి



# తేడా

సిటీబస్ కోసం గంట క్రితం నుంచి ఎదురు చూస్తున్నాడు పరంధామయ్య. నిలబడి నిలబడి కాళ్లు పీక్కుపోతున్నాయి. దాహంతో నాలుక పిడచకట్టుకుపోతోంది. మంచినీళ్లెక్కడన్నా దొరుకుతాయేమోనని చుట్టూ పరికించాడు. అలాంటి సూచన లేవీ కనిపించకపోవడంతో సోడా తాగుదామనిపించింది. కానీ మళ్లీ అంతలోనే ఇంకొద్దిసేపు నిలబడితే బస్సు రానే వస్తుంది కదా! అయిదు నిమిషాలలో ఇంటికి చేరుకుంటాడు. మళ్లీ పావలా దీనికోసం వృథా చేయడం ఎందుకనిపించి మిన్నకుండిపోయాడు.

బాబూ ధర్మం..... ఓ పావలా ధర్మం చేయండి మీ పాపాలను మీ నుంచి దూరం చేసుకోండి. గట్టిగా అరుస్తున్నాడు బస్ స్టాప్ పక్కన కూర్చున్న బిచ్చగాడొకడు. కాషాయ వస్త్రాలు, నుదుట విభూతితో ప్రత్యేకంగా కనిపిస్తున్నాడు వాడు. వాడి పక్కనే ఒక త్రిశూలం గుచ్చి వుంది. దానికి మూడు నిమ్మకాయలు అతికించి వున్నాయి. వాడి మాటలు వినగానే నాగస్వరం విన్న నాగుబాముల్లా నిలబడిపోయి చిల్లర లేకపోతే మార్చి మరీ వాడి బొచ్చెలోకి భక్తిగా వేస్తున్నారు జనం.

మరో అరగంట గడిచిపోయింది. అయినా బస్సు మాత్రం కనిపించలేదు. ఇక నిలబడే సహనం నశించింది పరంధామయ్యకి. సోడా తాగకపోతే శోష వచ్చి పడిపోతానేమోనని అనిపించింది. తాగుదామా? వద్దా? అని ఒక్క నిమిషం తర్జన భర్జన పడి చివరకు మెల్లగా కూల్ డ్రింక్ షాప్ వైపు నడిచాడు.

సోడా తాగుతుండగా పరంధామయ్యకు అనిపించింది- పాపం ఆ బిచ్చగాడు ఇందాక ఎప్పటి నుంచో, తనకన్నా ముందు నుంచి ఎండలో అలా అరుస్తున్నాడు. పావలానె కదా ఓ సోడా ఇప్పిస్తే మనస్సులోనే అనుకుని వాడిని పిలుద్దామని అటువైపు తిరిగాడు.

అప్పటికే బిచ్చగాడు షాపువైపు వస్తూ కనిపించాడు. వాడు దగ్గరకు రాగానే ఇంకో సోడా ఇవ్వు బాబూ అని షాపువాడితో అనబోయాను.

ఇంతలో "ఓ స్ప్రింట్ కొట్టు" పిడుగులా అన్నాడు బిచ్చగాడు. పరంధామయ్య ముందే డ్రింక్ తాగి సీసా తిరిగిచ్చి డబ్బులు చెల్లించేశాడు.

ఆశ్చర్యంతో చూస్తుండిపోయాడు పరంధామయ్య. తెగించలేని మధ్యతరగతివాడికి సోడాలే గతి అని మనస్సులోనే అనుకుని బస్ స్టాప్ వైపు కదిలాడు.

—జి.సుధాకర్